క్లుప్తంగా

మండపేటలో నేడు వైద్య శిబిరం

మండపేట: ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు ఆ ట్రస్టు సభ్యులు తెలిపారు. సత్యశ్రీ రోడ్డులోని వనజా ట్రాన్స్‌పోర్టు సమీపంలోని కలాం ట్రస్టు భవన్‌లో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా హాస్పిటల్ వైద్య నిపుణులు శిబిరానికి హాజరై రోగులకు పరీక్షల నిర్వహిస్తారని తెలిపారు. బీపీ, సుగరు, ఈసీజీ, థైరాయిడ్ వంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

ముత్యాలమ్మకు ఆషాఢం సారె


భక్తులు సమర్పించిన ఆషాఢం సారెతో ముత్యాలమ్మ వారు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ 'సాక్షి' వారి వీధిలో వేంచేసిన ముత్యాలమ్మ అమ్మవారికి శుభం స్వీట్స్ యజమాని కంచర్ల చక్రధరరావు (చక్రి), వీరవేణి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలు ఆషాఢమాసం పురస్కరించుకుని పెద్ద ఎత్తున తీపి కావడి సమర్పించారు. ముందుగా ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం నుంచి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టుచీర తీసుకుని, స్వీట్లతో మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయగా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


డ్వామా పీడీ వెంకటలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న దూడల శంకరనారాయణ తదితరులు

కాజులూరు: కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో నిర్మించిన చెత్తతో సంపద తయారీ కేంద్రాలను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ అన్నారు. శుక్రవారం మండల పర్యటనకు వచ్చిన డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మిని కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో శంకరనారాయణ, బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ రొక్కాల సత్తిబాబు తదితరులు కలిసి మండల గ్రామాల్లోని పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్లను తొలగించి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని, వారానికి ఒక రోజు పంచాయతీ అధికారులు పూర్తిగా గ్రామంలోనే పర్యటించేలా చేసి పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్నాథగిరి ఎంపీటీసీ కొప్పన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగరలో ప్రత్యేక పారిశుధ్య పనులు


అంగరలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలో పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, కార్యదర్శులు తాతపూడి సుభాకర్, మహ్మద్ ఆలీ, ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపడుతున్నామని అన్నారు.

శిథిలావస్థలో టైడల్ లాక్

- మూడు మండలాల్లో 20 వేల ఎకరాలకు ముంపు భయం
- రైతన్నల ఆందోళన


యానాంలో శిథిలావస్థకు చేరిన టైడల్‌లాక్ (ఫైల్)


తలుపులు పూర్తిగా తెరచుకోని యానాం టైడల్ లాక్ వద్ద నిలిచిన వరద (ప్రస్తుతం)

కాజులూరు: నియోజకవర్గ గ్రామాల మీదుగా ఉన్న డ్రైన్లు అధ్వానంగా ఉండటంతో ఏటా ఆరుగాలం కష్టించి పండించిన పంట ఏదో ఒక దశలో వర్షాల బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా యానాంలో టైడల్‌లాక్ (కోరంగి రెగ్యులేటర్) శిథిలావస్థకు చేరుకోవడం కాజులూరు, కె గంగవరం, తాళ్లరేవు మండల గ్రామాల్లోని రైతన్నల ఆందోళనకు మరింత కారణమౌతోంది. కె గంగవరం మండల గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న టేకి డ్రైన్, కాజులూరు మండల గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న అంద్రంగి డ్రైన్‌లు రెండూ తాళ్లరేవు మండల గ్రామాల సరిహద్దులో కోరంగి నదిలో కలసి యానాం వద్ద గోదావరి నదిలో కలుస్తోంది. ఈ డ్రైన్ల వెంబడి కె.గంగవరం, కాజులూరు, తాళ్లరేవు మండల గ్రామాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో పల్లపు భూములు ఉన్నాయి. కొద్దిపాటి వర్షాలకే సముద్రపు నీరు చేరి పొలాలు ముంపునకు గురవుతూ ఉంటాయి. 1990కి ముందు ఇక్కడప్పటికి ఒక పంట మాత్రమే సాగుబడిలో ఉండేది. తొలకరి సాగు చేసినా యానాం నుంచి కోరంగి నది ద్వారా తరచూ వరద నీరు ఇక్కడ పంట పొలాలకు చేరి ముంపునకు గురయ్యేవి. దీంతో అప్పటి ఆంధ్రా ప్రభుత్వం పాండిచ్చేరి ప్రాంతమైన యానాంలో కురసాంపేట వద్ద కోరంగి నది గోదావరిలో కలిసే చోట టైడల్‌లాక్ (కోరంగి రెగ్యులేటర్) నిర్మించాలని ప్రతిపాదించింది. 1993లో ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయగా 94లో పనులు పూర్తయ్యాయి. గోదావరిలో నీరు ఉధృతంగా ఉండి అవి పొలాలకు చేరే పరిస్థితి ఉంటే ఈ లాకుల వద్ద తలుపులు మూసివేస్తారు. దీంతో ముంపునీరు పొలాలకు చేరదు. ఇతర సమయాల్లో పొలాల్లోని వృథా నీరు ఈ డ్రెయిన్ ద్వారా గోదావరిలోకి చేరుతుంటుంది. ఈ లాకు కారణంగా ఈ డ్రెయిన్‌ల వెంబడి మూడు మండల గ్రామాల్లో ఉన్న పొలాలకు తొలకరి సాగుకు ఇబ్బందులు లేకుండా పోయాయి. అయితే ఇటీవల కాలంలో లాకులు శిథిలమై తలుపులు తుప్పుపట్టి పోయాయి. తుపాన్లు, వర్షాలు సంభవించినప్పుడు సకాలంలో లాకుల తలుపులు మూత పడకపోవడంతో పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీనికి తోడు టైడల్ లాకుల సమీపంలో డ్రెయిన్ బెర్ములను అక్కడి స్థానికులు ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించటంతో డ్రెయిన్ ఇరుకుగా మారి నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గతంలో పలుమార్లు తుపాన్ల సమయాల్లో భారీ వర్షాలు కురిసినపుడు లాకులు మూతపడకపోవడంతోనే మండల గ్రామాల్లోని వరి పొలాలు ముంపునకు ప్రధాన కారణమైందని రైతన్నలు వాపోతున్నారు. గత 10 రోజులుగా చెదురుమదురుగా కురుస్తున్న భారీ వర్షాలకు డ్రెయిన్‌లో నీరు సక్రమంగా లాగకపోవడంతో కె గంగవరం మండంలోని పేకేరు, నల్లచెరువుపుంత, కాజులూరు మండలంలోని ఉప్పుమిల్లి, కుయ్యేరు, పల్లిపాలెం, దుగ్గుదుర్రు తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో నారుమడులు నాట్లువేసిన పొలాలు రోజుల తరబడి నీటమునిగి కుళ్లిపోయాయి. కె.గంగవరం, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాలతో పాటు కాజులూరు మండలంలో సుమారు 40 శాతం తొలకరి సాగు ఈ టైడల్ లాక్‌పైనే ఆధారపడి ఉందని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఇక్కడి తలుపులు సకాలంలో మూతపడటం ఆపై సకాలంలో తెరచుకోవటం జరిగితేనే తమకు పంట దక్కుతుందని రైతన్నలు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఎలక్ట్రానిక్ విధానం ద్వారా స్విచ్ వేసిన వెంటనే టైడల్‌లాక్ తలుపులు మూసుకునేలా, తెరచుకునేలా ఏర్పాటు చేయాలన్నారు. ఆధునీకరణ పద్ధతిలో లాకులను పునర్నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ముంపు తప్పడం లేదు



టైడల్ లాక్ శిథిలమవడంతో గత కొన్నేళ్లుగా మండల గ్రామాల్లోని పంట పొలాలు ముంపునకు గురవుతూనే ఉన్నాయి. గోదావరిలో నీరు దిగువకు చేరి పొలాలను ముంచెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– మాత నూకరావు, రైతు, దుగ్గుదుర్రు

పునర్నిర్మించాలి



యానాం టైడల్ లాక్‌కు స్విచ్ వేస్తే తెరుచుకునేలా, మూసుకునేలా ఆధునీకరణ పద్ధతిలో పునర్నిర్మించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో లాకులు తుపానులు, వరదలు సమయాల్లో మూతవేసేందుకు వీలు పడకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– పిల్లి కృష్ణమూర్తి, రైతు, కుయ్యేరు

నిలకడగా గోదావరి


కోటిపల్లి రేవులో నిలకడగా ఉన్న వరద ప్రవాహం

వారం రోజులుగా నిలిచిన పంటు ప్రయాణం

కె.గంగవరం: ఎగువన వరద ఉధృతి పెరుగుతూ తగ్గుతూ ఉండటం, ఇంకా తగ్గకపోవడంతో కోటిపల్లిలో వరద ఉధృతి కొనసాగుతుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకు భారీగా వరదనీరు చేరుతుంది. శుక్రవారం ఉదయం నుంచి గోదావరి నిలకడగా ఉంది. గోదావరికి వరద పెరగడంతో ఇప్పటికే లంకల్లో ఉన్న పశువులను రైతులు గట్టుకు చేరవేసి ఏటిగట్టుపై వాటికి ఆశ్రయం కల్పించారు. గోదావరి అవతల వైపుకు వెళ్లే ప్రజలు ఎక్కువగా కోటిపల్లి–ముక్తేశ్వరం మధ్యలో తిరిగే పంటులనే ఆశ్రయిస్తుంటారు. అయితే వరద ఉధృతి వల్ల గోదావరి పెరిగిపోవడంతో పంటు ప్రయాణాన్ని గత వారం రోజులుగా రెవెన్యూ అధికారులు నిలిపివేశారు.


పంటు ఎక్కడానికి వెళ్లేదారిలో షాపుల వద్ద వరకు వచ్చిన గోదావరి

నిత్యం సొంత పనులపై వెళ్లే వ్యాపారులు, కూలీలు పంటు నిలిచిపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. యానం నుంచి వెళ్లాలంటే చాలా దూరమని దీంతో ఆర్థికంగా కూడా నలిగి పోతున్నామని వారు చెబుతున్నారు.

పురుగు మందులు లేని ఆహారం పండించాలి


చెల్లూరులో నిర్వహిస్తున్న పొలంబడి


మండపేట మండలం అంగరలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ఏసుబాబు

చెల్లూరులో పొలంబడి ప్రారంభం

రాయవరం: పురుగు మందుల అవశేషాలు లేని ఆహారోత్పత్తులను పండించాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. చెల్లూరు గ్రామంలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. మేలైన వ్యవసాయ పద్ధతులు రైతుల ద్వారా క్షేత్రస్థాయిలో చేయించి పురుగు మందులు, రసాయన ఎరువుల అవశేషాలు లేని ఆహారాన్ని పండించడమే ఈ పొలంబడి లక్ష్యమని ఆయన వివరించారు. పొలంబడిపై రైతులకు ఎంతవరకూ పరిజ్ఞానం ఉందో తెలుసుకునేందుకు వారికి ఏవో బ్యాలెట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం మేలైన వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు వివరించింది. మోతాదుకు మించకుండా పురుగు మందులను వాడడం వలన పెట్టుబడి ఖర్చును తగ్గిస్తూ నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలన్నారు. పొలంబడి క్షేత్రంలో మొదటి వారం నుంచి చివరి పంట కొచ్చే వరకు కూడా వివిధ స్థాయిలలో పరిశీలిస్తామన్నారు. పంట కోత దశలో వీటి నమూనాలను తీసుకుని ఇందులో రసాయన పురుగు మందుల ఎరువుల అవశేషాలు ఎంతవరకు ఉన్నవో పరీక్ష చేసి లోబడి ఉన్నట్లయితే అటువంటి రైతులకు సర్టిఫికెట్ కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోరంపూడి రాజ్‌కుమార్, రైతులు ముత్యాల వీర వెంకట సత్యనారాయణమూర్తి, వల్లూరి సత్యప్రసాద్, బలుసు వీర వెంకట సత్యనారాయణ చౌదరి, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడిద గ్రామంలో..

మండపేట: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఏడిద గ్రామంలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. ఏవో ఏసుబాబు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల వద్ద రైతులతో సమావేశమయ్యారు. ఖరీఫ్ సాగుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సాంకేతిక, ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలన్నారు. వర్షాల అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. మిత్ర పురుగుల ఆవశ్యకతను వివరించారు. శత్రు పురుగుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. రైతులు అవగాహన పెంపొందించుకోవడానికి తాను, వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో మేకా జేజిబాబు, వీఏఏ రమ్య, శంకర్, వినయ క్రాంతి, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి


మీడియాతో మాట్లాడుతున్న కమిషనర్ రాము

మండపేట: ఆధార్ కార్డు పొందిన పదేళ్లు పైబడిన వారందరూ తమ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆధార్ అప్‌డేట్, మార్పులు, చేర్పుల కోసం ఉచిత ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని 30 వార్డుల ప్రజలకు అందుబాటులో విధంగాలా సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల లబ్ధికి ఆధార్ కీలకంగా మారే అవకాశం ఉందన్నారు.

టౌన్‌లో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి

మండపేట: విద్యుత్తు వినియోగదారులందరికీ అందుబాటులో ఉండేలా పట్టణ నడిబొడ్డున ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పట్టణ నడి మధ్యన కాల్ సెంటర్ ఉండేదన్నారు. మున్సిపల్ కార్యాలయం పక్క వీధిలో ఉండే కాల్ సెంటర్‌ను తొలగించి నాలుగు కిలోమీటర్ల దూరంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు మార్చేశారని ఆయనన్నారు. తమ విద్యుత్ సమస్యలపై పట్టణ వినియోగదారులు ఫిర్యాదు చేయాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.

బాలలతో పనులు చేయిస్తే జరిమానా


మీడియాతో మాట్లాడుతున్న శివ నాగమల్లేశ్వరరావు

మండపేట: వ్యాపారులు ఎవరైనా బాలబాలికలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ శివ నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని కాలభైరవ స్వామి ఆలయం వద్ద గల తన కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలమూరు మండలం మూలస్థానం గ్రామంలో బాల కార్మికులతో పని చేయిస్తున్న ఓ ఇటుక బట్టీ యజమానిపై కేసు నమోదు చేశామని చెప్పారు. దీనిపై ఆలమూరు కోర్టు న్యాయమూర్తి విచారణ జరిపి ఆ ఇటుక బట్టీ యజమానికి రూ 20 వేల జరిమానా విధించారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు, ఇటుక బట్టీల యజమానులు మసులు కోవాలన్నారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారంతా బాలల కిందకే వస్తారన్నారు.

లైంగిక వేధింపుల నివారణపై అవగాహన


మానవహారంగా ఏర్పడిన ఏడిద ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు

మండపేట: బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టడంపై మండలంలోని ఏడిద ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.గజలక్ష్మి అవగాహన కల్పించారు. మిషన్ శక్తి పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు తదితర అంశాలపై విద్యార్థినులకు, వారి తల్లులకు అవగాహన కల్పించారు. గజలక్ష్మి మాట్లాడుతూ మిషన్ శక్తి పేరు మీద 100 రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బాలికలతో ఆ పాఠశాల ఆవరణలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏడబ్ల్యూడబ్ల్యూ వర్కర్స్, వి.సింహాచలం పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి


హసన్‌బాదలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్వరరావు


ద్వారపూడిలో విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌లో కిట్ల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ పేద విద్యార్థుల ఉన్నతికి రూపొందించిన విద్యా కానుక కిట్లు వారి చదువులకు ఎంతగానో దోహదం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా ఆయన ఆశయం కొనసాగుతుందన్నారు. ప్రతి విద్యార్థి కిట్లు సద్వినియోగం చేసుకుని చదువుల్లో మరింతగా రాణించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.సుభద్రాలక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యెన్నం దేవి, ఉప సర్పంచ్ ఎన్.భవాని, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ వై.నాగేశ్వరరావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, గ్రామ పెద్దలు జి.వీరన్న, పి.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపేట: మండలంలోని ద్వారపూడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందించారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఈ కిట్లను శుక్రవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ చేతుల విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సవితాల సుబ్రహ్మణ్యం, బత్తుల శ్రీను, పసుమర్తి శ్రీను, కందుల ఫణీంద్ర, బొండాడ రాము, నరవా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళి


హసన్‌బాద చేనేత సహకార సంఘంలో ప్రగడ కోటయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న చేనేత నాయకులు

రామచంద్రపురం రూరల్: చేనేత పితామహుడుగా పేరొందిన ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకుని హసన్‌బాద చేనేత సొసైటీలో చేనేత నాయకులు శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. హసన్‌బాద సొసైటీ చైర్మన్ దొంతంశెట్టి సత్యప్రకాశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చేనేత సహకార సంఘాలు రాష్ట్రంలో బలంగా కొనసాగుతుండడానికి ప్రజా ప్రతినిధిగా కోటయ్య అవిరళ కృషి కారణమని నాయకులు పేర్కొన్నారు. ఆయన బాటలో తమ సహకార సంఘ వ్యవస్థాపకుడు దొంతంశెట్టి విరూపాక్షం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం చేనేత పరిశ్రమ కుదేలైందని, వెంటనే ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చేనేత పరిశ్రమను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో హసన్‌బాద చేనేత సహకార సంఘం సభ్యులు, మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బట్టేలంకలో విజయ్‌దివస్ వేడుకలు


బట్టేలంకలో మాజీ సైనికులను సన్మానిస్తున్న సర్పంచ్ బోనం సీతారత్నం

మలికిపురం: కార్గిల్ యుద్ధం జరిగి నేటికి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా మండలంలోని బట్టేలంకలో విజయ్‌దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బోనం సీతారత్నం ఆధ్వర్యంలో మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ మాట్లాడుతూ పాకిస్తాన్ కుయుక్తులను దీటుగా ఎదుర్కొని భారతదేశ ప్రజలు గర్వించేలా తమ శక్తియుక్తులను ప్రదర్శించి విజయతీరాలకు చేర్చి కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు ఘనంగా నివాళులు అర్పించడం మన బాధ్యత అని అన్నారు. భరించలేని ఎండ వేడిమి, మైనస్ డిగ్రీల చలిలోనూ అహోరాత్రాలు దేశ సరిహద్దులను కాపాడుతున్న సైన్యానికి మనమంతా కృతజ్ఞులమై ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు ఉల్లంపర్తి రామ్మూర్తి, ఉల్లంపర్తి ఏసురత్నంలను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆవుపాటి ఉమాలలిత శివజ్యోతి, పెన్మెత్స త్రిమూర్తిరాజు, బోనం చంటి, రాము, తాతారావు, అన్నంనీడి ఏసు, చిట్టాల సూర్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికార మదంతో టీడీపీ నేత దౌర్జన్యం


కొత్తపేట విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ఫిర్యాదు అందజేస్తున్న బాధితుడు సత్యనారాయణశర్మ

కొత్తపేట: గతంలో ఎప్పుడే లేని విధంగా రాష్ట్రంలో టీడీపీ దౌర్జన్యాలు, దమన కాండలు ప్రజానీకాన్ని గగుర్పాటుకు గురిచేస్తున్నాయని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మాజీ ప్రచార కార్యదర్శి, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార మదంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు బలహీనులు, అమాయకులపై కూడా తమ ప్రతాపం చూపిస్తున్నారని ఆరోపించారు.

ఆ సంస్కృతి నియోజకవర్గానికి కూడా దాపురించిందన్నారు. మండలంలోని మందపల్లిలో అధికార టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధి ఒకరి ఆగడాలు పెచ్చుమీరిపోయాయని విమర్శించారు. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద స్థలంలో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను తొలగించి ఒక స్తంభాన్ని బ్రాహ్మణ కులానికి చెందిన అయిలూరి సత్యనారాయణశర్మ అనే స్థానిక పూజారి స్థలంలో వేయించారని, ఇదేంటి తన స్థలంలో వేశారని అడిగితే ఆ నాయకుడు దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు చంపేస్తానని భయభ్రాంతులకు గురిచేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విద్యుత్ శాఖాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన బ్రాహ్మణ ఒంటరి మహిళపై ప్రజాప్రతినిధితో పాటు మరో టీడీపీ నాయకుడు తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమె కూడా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆయా ఫిర్యాదులపై పోలీసు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆ ఇద్దరు బాధితులకు న్యాయం చేయాలని బ్రాహ్మణ సంఘం తరపున ముసునూరి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి

అంబాజీపేట: మెళకువలతో కూడిన కఠినమైన సాధన చేస్తూ క్రీడలపై దృష్టి సారిస్తే ఏ పోటీల్లోనైనా బంగారు పతకాలు సాధించవచ్చని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. ఇటీవల కాకినాడలో తైక్వాండో ఉమ్మడి జిల్లా పోటీలో మెడల్స్ సాధించిన క్రీడాకారులను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం అభినందనలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. వచ్చే నెల 2 నుంచి 4వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు వెళ్లే విద్యార్థులను అభినందనలు తెలిపారు. అనంతరం మెడల్స్ సాధించిన క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి బాణసంచా వేలం

అంబాజీపేట: పేలుడు పదార్థాల (ఎక్స్‌ప్లోజివ్స్) చట్టం ప్రకారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్న దీపావళి బాణసంచాను కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 29న వేలం వేస్తున్నట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఉత్తర్వుల ప్రకారం, మాచవరం గ్రామం పండువారిపేట సమీపాన ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్.ఐ చెప్పారు. పేలుడు పదార్థాల లైసెన్స్ కలిగిన ఉన్న వ్యక్తులు వేలానికి హాజరు కావాలని ఎస్సై కోరారు.